# తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక


### బీఆర్ఎస్ దోపిడీతో తెలంగాణ విధ్వంసం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

ఆర్ఎస్ పాలకులు ఆర్థిక, సామాజిక దోపిడీకి పాల్పడి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలను తమ కుటుంబం కోసం తమ నలుగురి కోసం అన్నట్లుగా పదేళ్లు చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సంపదను నలుగురు కుటుంబ సభ్యులు దోచుకొని ఆ డబ్బుతో నాలుగు చానళ్లు పత్రికలు సోషల్ మీడియా ద్వారా అబద్దాలు పోగేసి ప్రజా ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాడు ఉపముఖ్యమంత్రి సతీసమేతంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ట మహా కుంభాభిషేక ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి దంపతులకు వేద పండితులు, అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.


హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 227 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | మంగళవారం, జూన్ 30, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-


## రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు – 2047' సాధ్యం: మంత్రి సీతక్క



న్యూఢిల్లీ, జూన్ 29: వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. ఈరోజు(సోమవారం) ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఎఃఉ ఖీంఓ ఉపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు?2047' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు.ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో పాత 100 శాతం వేతనాల విధానమే కొనసాగించాలని సీతక్క కోరారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త విధానం వల్ల రాష్ట్రాలపై భారీగా ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని.. ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంద న్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులే ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని వివరించారు.కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి నిధుల విడుదలలో కూడా జాప్యం జరుగు తోందన్నారు. తరచూ అధికారుల బదిలీలతో నివేదికల సమర్పణలో ఆలస్యం జరిగిందని అన్నారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణకు 13 జాతీయ అవార్డులు వచ్చాయని.. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## సీషెల్స్ స్వాతంత్ర్య వేడుకల్లో భారత సైనిక దళాల కవాతు.. లేచి నిలబడిన ప్రధాని మోదీ

విక్టోరియా: భారత్–సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నేడు (సోమవారం) భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది.రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బడ్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి.ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్–సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది.మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి ఆదివారం నాడు అందజేశారు.



# ఒట్టేసి చెబుతున్నా.. మూసీ ప్రక్షాళన తథ్యం

- **తెలంగాణ కోసం ఎవరేమిచేశారో శాసనసభలో మాట్లాడదాం**
- **మూడు పార్టీల పాలనపై రచ్చబండలో చర్చ పెట్టండి**
- **ఏం త్యాగాలు చేశారని భారాసను ప్రజలు కోరుకుంటున్నారు**
- **నల్గొండ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**
- **రూ.13,006 కోట్లతో 6,092 కి.మీ. హ్యామ్ రోడ్ల పనులకు భూమి పూజ**

హైదరాబాద్, నల్గొండ: "ఎన్ని ఆటంకాలు ఎదురైనా దేశానికి తలమానికంగా మూసీని ప్రక్షాళన చేస్తాం. కాలుష్యం నుంచి నల్గొండ బిడ్డలకు విముక్తి కలిగిస్తాం. ఒట్టేసి చెబుతున్నా. మూసీ ప్రక్షాళన తథ్యం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర నిర్మించనున్న 441 హ్యామ్ రోడ్ల పనులకు సీఎం ఆదివారం నల్గొండ జిల్లా కనగల్‌లో భూమి పూజ చేశారు. పైలాన్‌ను ఆవిష్కరించారు. నల్గొండ కార్పొరేషన్‌లో రూ.83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకం పనులకూ శంకుస్థాపన చేశారు. తర్వాత నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. "బావబామ్మరిది కలిసి తిరుగుతున్నారు. భారాస ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అంటున్నారు. పరీక్ష పేపర్లు అమ్ముకొని రూ.వేల కోట్లు సంపాదించుకున్నందుకు రావాలా? కాళేశ్వరం పేరు మీద రూ.లక్ష కోట్లు కొల్లగొట్టినందుకా? పేదోళ్లకు రేషన్‌కార్డులు అడిగితే స్టేషన్‌లో పెట్టి కొట్టించినందుకా? మీరెందుకు అధికారంలోకి రావాలి. రచ్చబండలో చర్చ పెట్టండి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారు. రెండున్నరేళ్లలో ఏమి తెచ్చారని అడుగుతున్నారు. ఎప్పుడడిగినా ప్రత్యేక శాసనసభ, మండలి సమావేశాలు ఏర్పాటు చేస్తాం. పదేళ్ల భారాస, రెండున్నరేళ్ల కాంగ్రెస్, కేంద్రంలో పన్నెండేళ్ల భాజపా పాలనపై చర్చిద్దాం. అక్కడే తేలుస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోవడం వల్ల ఊరూరా తిరిగి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. సింగరేణిలో టెండర్ కాలేదు.. కొల్లగొట్టారంటున్నారు. గురుకులాల్లో రూ.685 కోట్ల టెండర్లలో రూ.3వేల కోట్లు అక్రమాలు జరిగాయని చెప్పారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా, ఎన్ని నాటకాలు చేసిన తెలంగాణ సమాజం నమ్మదు. రాష్ట్రంలో ప్రజాపాలన వచ్చింది. ప్రజలు సంక్షేమ పథకాలను అనుభవిస్తున్నారు. ఈ తెలంగాణ సమాజం మీ కుటుంబాన్ని శాశ్వతంగా బహిష్కరించింది. 2034 వరకు రాష్ట్రంలో మూడు రంగుల జెండా ఎగురుతుంది.

**నల్గొండ బహిరంగ సభకు హాజరైన జనం**

**ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం**

ఎస్ఎల్‌బీసీ పనులను 34 కిలోమీటర్ల మేర పూర్తి చేసి భారాస ప్రభుత్వానికి 10 కిలోమీటర్ల పనులు అప్పగిస్తే పదేళ్లు అలానే ఉంచారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి 3.60 లక్షల ఎకరాల్లో నల్గొండ జిల్లాకు సాగు, తాగునీరు అందిస్తాం. డిండి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. నా పాదయాత్ర సమయంలో మూసీ ఇబ్బందులను ప్రజలు వివరించారు. ఆ కాలుష్యంతో ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు ప్రాంతాలు ఎంతో దారుణంగా ఉన్నాయి. అందుకే మూసీ ప్రక్షాళనకు కంకణం కట్టుకున్నాం. 30 నెలల్లో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం ఈ దేశంలో ఎక్కడైనా ఉందా అని సవాల్ విసురుతున్నా. శాఖల వారీగా లెక్కలు చెబుతా. శాసనసభకు రండి. నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం. ప్రజా పాలన ఎందుకు పోవాలి. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, ఫీజు రీయింబర్స్‌మెంట్,



రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినందుకు, రూ.27వేల కోట్ల రైతు భరోసా ఇచ్చినందుకు ప్రజా పాలన పోవాలా? స్కిల్స్ యూనివర్సిటీ తెచ్చినందుకు పోవాలా? కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయిన ఒక్క సంవత్సరంలో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాం. భారాస పాలనలో ప్రభుత్వ బడికి, ఆసుపత్రికి పోవాలంటే ప్రజలు భయపడేవారు. ఇప్పుడు అదే పాఠశాలల్లో నర్సరీ నుంచి 12 వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నాం. తెలంగాణ గురుకులాలు వందల మంది అంబేద్కర్‌లను తయారు చేయాలనే టమొక్కవొని ధైర్యంతో ముందుకు పోతున్నాం. ఆరుట్ల పాఠశాల ప్రారంభోత్సవానికి వెళ్లాక నాకు సంపూర్ణ విశ్వాసం వచ్చింది. మా ప్రభుత్వ ఉపాధ్యాయులు మేం గర్వంతో తలెత్తుకునే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నారు.

# అయోధ్య విరాళాల కేసు..

### నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ



అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో వారు జులై 13 వరకు జైలులోనే ఉండనున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున నిందితులను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిన అవసరముందని పోలీసులు కోర్టుకు వివరించడంతో.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది న్యాయస్థానం.ఈ కేసులో రామశంకర్ అలియాస్ తిన్నూ యాదవ్ సహా అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్‌శంకర్ మిశ్రా, సుభాశ్ శ్రీవాస్తవ్‌లు నిందితులుగా ఉన్నారు. వీరంతా రామాలయానికి వచ్చిన విరాళాల నగదు, విలువైన వస్తువుల లెక్కింపు, నిర్వహణ బాధ్యతల్లో పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికే నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(ఎస్ఐటీ).. సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. నిందితులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వారి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు అకౌంట్లు, ఆస్తుల వివరాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఈ కేసులో కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర కూడా ఉందనే అనుమానంతో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.మరిన్ని వివరా లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఇదిలా ఉండగా.. సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తక్షణ విచారణకు నిరాకరించింది. ముందుగా పిటిషన్‌కాపీని రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది. కాగా.. ప్రస్తుతం ఈ ఘటన ఉత్తర్‌ప్ర దేశ్ రాజకీయాల్లో చర్చనీయా ంశం గా మారింది. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు యోగి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పిస్తు న్నాయి. మరోవైపు, దోషులపై కఠిన చర్యలు తప్పవన్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రతిపక్షాలు రాజకీ య లబ్ధి కోసం కావాలనే ఈ అంశంపై అనవసర రచ్చ చేస్తున్నారని ఆరోపిస్తోంది.

## గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది: శివరాజ్‌సింగ్

న్యూఢిల్లీ, జూన్ 29: తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు.గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐ కి నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు.

# భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుంది

### ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా



ఢిల్లీ, జూన్ 29: భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో పుంజుకుందని ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రమోద్ కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన త్రైమాసిక, వార్షిక స్థూల దేశీయోత్పత్తి గణాంకాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో ఇవాళ జరిగిన 20వ జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ మాత్ర[redacted]తమైన అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం తీసుకు[redacted]ులను దేటా ఆధారంగానే ఉంటుందని పీకే మిశ్రా వివరించారు. 'మ[redacted]ులను నిరంతరం కొలవడానికి దేటా ఎంతో అవసరం. 'వికసిత్ భారత్' (అ[redacted]డానికి ఈ దేటా ఆధారిత నిర్ణయాలే దిక్సూచిగా మారనున్నాయి' అని ఆ[redacted]ాఖలు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఆఖఎ) ద్వారా భారీ మొత్తంలో దేటా[redacted]ప్పారు. వివిధ మంత్రిత్వ శాఖల డిజిటల్ కార్యకలాపాల ద్వారా జనరే[redacted]ంగా ఉ పయోగించుకోవడానికి ప్రభుత్వం పలు అంశాలపై దృష్టి సారించి[redacted]దేటాను ఒకదానితో ఒకటి అనుసంధానించేలా చేయడం, సంప్రదాయ సరే[redacted]పోలేలా నాణ్యతను మెరుగుపరచడం, అధికారిక గణాంకాల పరిధిని [redacted]రాన్ని అందుబాటులోకి తేవడం వీటి ప్రధాన ఉద్దేశమని మిశ్రా వెల్ల[redacted]గ్రంగా, వేగంగా తీసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ంఎ) సాంకేతి[redacted]స్తుందని మిశ్రా అభిప్రాయపడ్డారు.

# జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ఎఫ్‌టీజీ తొలి భారత తయారీ కేంద్రం ప్రారంభం







హైదరాబాద్, జూన్ 29, 2026: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (+ఎ××ూూ)కు పూర్తిగా అనుబంధ సంస్థ అయిన జీఎంఆర్ హైదరాబాద్ ఏవియేషన్ ఎస్ఈజెడ్ లిమిటెడ్ (+ూూూూ), జీఎంఆర్ ఏరోస్పేస్ ఁ ఇండస్ట్రియల్ పార్క్, హైదరాబాద్‌లో ఎఫ్‌టీజీ (ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్) తొలి భారత తయారీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఈరోజు ప్రకటించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, జీఎంఆర్ మరియు ఎఫ్‌టీజీ సంస్థల ఉన్నత నాయకత్వం హాజరయ్యారు. ఈ ప్రారంభం, ప్రపంచ ఏరోస్పేస్ తయారీ విలువ శ్రేణిలో భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేసే కీలక మైలురాయిగా నిలిచింది.

ఎఫ్‌టీజీ భారతదేశంలో కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా కెనడా, అమెరికా, చైనా తర్వాత నాలుగో అంతర్జాతీయ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అధిక ఖచ్చితత్వం అవసరమైన ఏరోస్పేస్ ఎలక్ట్రానిక్స్ తయారీకి భారతదేశం అనువైన గమ్యస్థానంగా ఎదుగుతున్నదనడానికి ఇది మరో నిదర్శనం. కొత్తగా ప్రారంభమైన ఈ కేంద్రంలో అత్యాధునిక ఏవియానిక్స్ మరియు కాక్‌పిట్ ఇంటర్‌ఫేస్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి చేయబడుతుంది. ఇవి ప్రపంచవ్యాప్తంగా ఏరోస్పేస్ మరియు రక్షణ రంగ కార్యక్రమాలకు మద్దతు అందించనున్నాయి. ప్రత్యేకంగా కస్టమర్ అవసరాలకు అనుగుణంగా నిర్మించిన 'బిల్ట్-టు-సూట్ (డ్యూ)' సదుపాయంగా అభివృద్ధి చేసిన ఈ యూనిట్, ప్రపంచ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ (ఓఈఎం) నిర్దేశించిన కఠిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను రూపకల్పన చేసి అందించగల జీఎంఆర్ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. 277 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జీఎంఆర్ ఏరోస్పేస్ ఁ ఇండస్ట్రియల్ పార్క్‌లో భాగంగా ఉండటంతో, ఈ కేంద్రం భారతదేశంలోనే అత్యంత సమగ్రమైన విమానాశ్రయ ఆధారిత పారిశ్రామిక ఎకోసిస్టమ్ ప్రయోజనాలను పొందనుంది.

ఈ సందర్భంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈఓ శ్రీ అమన్ కపూర్ మాట్లాడుతూ, "జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ఎఫ్‌టీజీ తొలి భారత తయారీ కేంద్రం ప్రారంభం, ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యం కలిగిన ఏరోస్పేస్ తయారీ ఎకోసిస్టమ్ నిర్మాణంలో కీలక ముందడుగు. ప్రపంచ ప్రముఖ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థలు భారతదేశంపై, అలాగే కస్టమైజ్డ్ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందించగల జీఎంఆర్ సామర్థ్యంపై ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనం. ఎఫ్‌టీజీ ఉనికి దేశీయ, ఎగుమతి సరఫరా గొలుసులను బలోపేతం చేయడంతో పాటు, స్వదేశీకరణకు ఊతమివ్వడంలో మరియు హైదరాబాద్‌ను ఏరోస్పేస్, పారిశ్రామిక ఆవిష్కరణల ప్రధాన కేంద్రంగా మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని అన్నారు.

ఈ సందర్భంగా ఎఫ్‌టీజీ కార్పొరేషన్ ప్రెసిడెంట్ ఁ సీఈఓ బ్రాడ్ బోర్న్ మాట్లాడుతూ, "భారతదేశంలో మా తొలి తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం ఎఫ్‌టీజీకి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన మైలురాయి. ప్రతిభావంతులైన ఇంజినీరింగ్ నైపుణ్యం, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ మరియు రక్షణ రంగం, తయారీ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలు కెనడా, అమెరికా, చైనా తర్వాత భారతదేశాన్ని మా గ్లోబల్ విస్తరణలో తదుపరి గమ్యస్థానంగా మార్చాయి. జీఎంఆర్ అందించిన ప్రపంచ స్థాయి బిల్ట్-టు-సూట్ మౌలిక సదుపాయాలు, విమానాశ్రయ ఆధారిత సమగ్ర పారిశ్రామిక ఎకోసిస్టమ్ వల్ల మా అంతర్జాతీయ వినియోగదారులకు అవసరమైన అత్యంత విశ్వసనీయ ఏవియానిక్స్ మరియు కాక్‌పిట్ ఇంటర్‌ఫేస్ ఎలక్ట్రానిక్స్‌ను అందించగలుగుతున్నాము. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం, భారత ఏరోస్పేస్ విలువ శ్రేణిని బలోపేతం చేయడంలో భాగస్వాములు కావడం మాకు గర్వకారణం" అని తెలిపారు.

ఎఫ్‌టీజీ సంస్థ అధిక విశ్వసనీయత కలిగిన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు మరియు ఏవియానిక్స్ ఉపవ్యవస్థల రూపకల్పన, తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఏరోస్పేస్, రక్షణ మరియు అంతరిక్ష రంగాలకు సేవలందిస్తున్న ఈ సంస్థ ఉత్తర అమెరికా మరియు ఆసియాలో కార్యకలాపాలు నిర్వహిస్తూ, అత్యున్నత ఖచ్చితత్వ ఇంజినీరింగ్ సామర్థ్యాలు, మిషన్-క్రిటికల్ ఎలక్ట్రానిక్ పరిష్కారాలతో ప్రముఖ అంతర్జాతీయ ఏరోస్పేస్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీలకు సేవలందిస్తోంది.

ఎఫ్‌టీజీ చేరికతో జీఎంఆర్ ఏరోస్పేస్ ఁ ఇండస్ట్రియల్ పార్క్ భారతదేశంలోని ప్రముఖ ఏరోస్పేస్ మరియు రక్షణ తయారీ కేంద్రంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ప్రస్తుతం ఈ పార్క్‌లో సాఫ్రాన్, ప్రాట్ ఁ విట్నీ, సీఎఫ్ఎమ్, ఎక్స్‌డీఎల్‌లింక్స్, ఎఫ్ఎస్‌టీసీ, గ్రైటెల్ ఏవియేషన్, సైయెంట్ డీఎల్ఎమ్, స్కైరూట్ ఏరోస్పేస్, స్కైడర్ ఎలక్ట్రిక్, టెక్నిప్ఎఫ్ఎంసీ మరియు జీఎంఆర్ ఏరో టెక్నిక్ వంటి దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. తయారీ, నిర్వహణ, శిక్షణ మరియు ఆవిష్కరణలను ఒకే వేదికపై కలిపిన ప్రత్యేక పారిశ్రామిక ఎకోసిస్టమ్‌గా ఈ పార్క్ అభివృద్ధి చెందుతోంది.

ఈ ప్రారంభంతో, భారతదేశంలో ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడంలో జీఎంఆర్ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమగ్ర పారిశ్రామిక ఎకోసిస్టమ్ నిర్మాణం, వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి, అలాగే భారత ఏరోస్పేస్ మరియు రక్షణ రంగ ఆఫ్‌సెట్ లక్ష్యాల సాధనకు మరింత వేగం చేకూర్చేందుకు కట్టుబడి ఉంది.

## విద్యార్థులకు ఆధునిక సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 29 తెలంగాణ పవర్ : మణుగూరు మండలం లంక మల్లారం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ఉన్నతీకరించబడిన జూనియర్ కళాశాలలో రూ. 13.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సైన్స్ ల్యాబ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పట్టణ స్థాయి విద్యా సౌకర్యాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. సైన్స్ ల్యాబ్ అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపరుచుకుని ఉన్నత విద్యలో రాణించే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా వారాంతపు మెనూ, భోజన నాణ్యత, హాస్టల్‌లో కల్పిస్తున్న వసతుల గురించి హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, వసతి, విద్యా సౌకర్యాలు, ఇతర సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి, అన్ని విద్యా సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూన్ 29 తెలంగాణ పవర్ : మణుగూరు మండలంలోని ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆసుపత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం ఆసుపత్రిలో సేవల నాణ్యత మరింత మెరుగుపడి, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆసుపత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకొని, వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలత, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ ను సన్మానించిన ఎస్టీఓ చారి



జహీరాబాద్ జూన్ 29:: జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ గా ఇటీవల జీ. ప్రభాకర్ నియమితులయ్యారు. సోమవారం సబ్ ట్రజరీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కు సన్మానం నిర్వహించారు. కార్యాలయాన్ని సందర్శించిన కమిషనర్ కు శాలువా కప్పి స్టాఫ్ సత్కరించింది. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ ఆఫీసర్(ఎస్టీఒ) నర్సింహాచారి, అధికారులు కొండల్ రెడ్డి, వెంకట్, అశమ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సేవలో ముందుండాలని సూచించారు. తనను సన్మానించినందుకు గాను ఎస్టీఒ కార్యాలయ అధికార, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## మంథనిలో ఫర్టిలైజర్ షాపుల ఇష్టారాజ్యంపై డీవైఎఫ్ఐ ఆందోళన వ్యాపారుల ఆస్తులు, లావాదేవీలపై విచారణ జరపాలని డీవైఎఫ్ఐ డిమాండ్

మంథనిలోని కొన్ని ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ ఆరోపించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు పత్తి, వరి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేస్తున్న తరుణంలో కొందరు వ్యాపారులు అధిక లాభాల కోసం రైతులకు అవసరం లేని ఉత్పత్తులను విక్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అన్ని ఫెర్టిలైజర్ బ్యాగ్ స్ ప్రధానికి వందల రూపాయలు ఎక్కువగా అమ్ముతున్నారు ఎంఆర్పి రేటు కన్నా ఎక్కువగా గవర్నమెంట్ అడ్రస్ సెంటర్లో కూడా ఎంఆర్పి రేటు కన్నా ఎక్కువగా అమ్ముతున్నారు మార్క్ ఫెడ్ ద్వారా వచ్చే స్టాక్స్ అందుబాటులో ఉండడం లేదు ప్రతి డిఏపీ బ్యాగ్ కి అనవసరమైన లింకులు పెట్టి అమ్ముతున్నారు అగ్రికల్చర్ ఆఫీసర్ కి అన్నీ తెలిసిన పట్టించుకోవడం పోవడం తో రైతూ లు పి ఎక్కువ ఆర్థిక భారం పడుతుంది అగ్రోస్ సెంటర్లో కూడా పర్యవేక్షణ కరువైంది.

దీంతో చిన్న, నన్నకారు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుండగా, వ్యాపారులు మాత్రం భారీగా ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. కొందరు రియల్ ఎస్టేట్, వ్యవసాయ భూముల కొనుగోళ్లతో పాటు ఇతర పెట్టుబడులు పెడుతున్నప్పటికీ, వారి లావాదేవీలపై సంబంధిత శాఖల పర్యవేక్షణ లేదని విమర్శించారు.

ఫర్టిలైజర్ వ్యాపారుల లావాదేవీలు, ఆదాయ వనరులు, ఆస్తులపై వ్యవసాయ శాఖ, టాస్క్ ఫోర్స్, ఆదాయపు పన్ను శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐతో పాటు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం: ఏవో నవ్య

మంథని మండలంలో నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్ముతున్నట్లు తమ దృష్టికి రాలేదని మండల వ్యవసాయ అధికారి నవ్య తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు ఫిర్యాదు చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే మేమే ఫిర్యాదు చేస్తాం: ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ సెక్రటరీ మలహార్ రావు

మంథని మండలంలో సుమారు 25 ఫెర్టిలైజర్ షాపులు కొనసాగుతున్నాయని ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మలహార్‌రావు తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మినట్లు తమ దృష్టికి తీసుకువస్తే అసోసియేషన్ తరపున వ్యవసాయ అధికారులకు, పోలీసులకు తామే ఫిర్యాదు చేస్తామని ఆయన అన్నారు. నిరాధారమైన ఆరోపణలను ఆయన ఖండించారు.



# ఒకే రోజు 22 శస్త్రచికిత్సలు

### పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో వైద్య సేవలు

### సూపరింటెండెంట్- డాక్టర్ శ్రీధర్

పెద్దపల్లి జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేల ప్రత్యేక సహకారంతో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాల ద్వారా ప్రజలకు అత్యుత్తమ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో రోజుకు సుమారు 1200 మంది వరకు రోగులు ఓపీ బహిరంగ రోగుల విభాగం సేవలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ ఆసుపత్రి నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని సోమవారం ఒక్క రోజే జిల్లా ఆసుపత్రిలో వైద్య బృందం వివిధ విభాగాల్లో పలు సంక్లిష్ట శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిందని అన్నారు .

?గైనకాలజీ విభాగంలో 9 ప్రసవాలు (డెలివరీలు), 1 ట్యూబెక్టమీ, 1 సల్పింజెక్టమీ శస్త్రచికిత్సలు. ఆర్థోపెడిక్ విభాగంలో ఎముకల వ్యాధులకు సంబంధించి 6 శస్త్రచికిత్సలు,?జనరల్ సర్జరీ విభాగంలో 2 శస్త్రచికిత్సలు,?ఆప్తమాలజీ విభాగంలో 3 కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు.

??వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ సూచించారు. తాగునీటిని తప్పనిసరిగా మరిగించి శుద్ధి చేసి మాత్రమే తాగాలని,?బయటి ఆహారాన్ని కలుషితమైన ఆహార పదార్థాలను పూర్తిగా దూరం పెట్టాలి.

?భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

?ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చు. ?ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు. ఈ కాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

??ఆసుపత్రి సేవలపై ఏవైనా సూచనలు, ఫిర్యాదులు లేదా ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రజలు తనను నేరుగా కలవవచ్చని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఆసుపత్రిలోని రూమ్ నెం. 16 లో తాను అందరికి అందుబాటులో ఉంటానని చెప్పారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ ద్వారా కూడా ఎప్పుడైనా స్పందించేందుకు సిద్ధంగా ఉంటానని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ కోరారు.




## ప్రభుత్వ స్థలాల కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

### -ఆర్డీవోకు కౌన్సిలర్ నామ స్రవంతి వినతి

జహీరాబాద్ జూన్ 29: జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరుతూ ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. జహీరాబాద్ పట్టణంలోని పలు కాలనీలలో ప్రభుత్వ స్థలాలను అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే వాటిని నిలిపివేసి ప్రభుత్వ భూములను రక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నాలాలను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఇటువంటి ఆక్రమణల వల్ల భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడి వాటిలో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలని ఆమె సూచించారు. ముఖ్యంగా జహీరాబాద్ పట్టణంలోని అనేక అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆయా కేంద్రాలకు శాశ్వత సొంత భవనాలు నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. ప్రభుత్వ భూములు, నాలాల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని నామ స్రవంతి ఆర్డీవోను కోరారు.



# హైదరాబాద్ లో నకిలీ గోల్డ్ మ్యాన్స్....

హైదరాబాద్ జూన్ 29, (న్యూస్ పల్స్)పొందూరు కాటన్ వేస్తారు. దానికి తగ్గట్టుగా వైట్ షూ ధరిస్తారు. మెడలో కిలోల కొద్ది బంగారం ధరిస్తారు. చివరికి మహిళలు కూడా అసూయపడే విధంగా బంగారు నగలు వేసుకుంటారు. పశువుల మెడలో వేసే పలుపు తాళ్ల మాదిరిగా బంగారు గొలుసులు ధరించి ట్రెండ్ సెట్టర్లుగా నిలుస్తూ ఉంటారు.సోషల్ మీడియాలో ప్రత్యేకంగా గ్రూపులు నిర్వహిస్తూ ఉంటారు. సెలబ్రిటీలతో ఫోటోలు దిగుతూ ఉంటారు. సదర్ పండుగలు.. బోనాల పండుగలు.. ఇతర వేడుకల సమయంలో బంగారం ధరించి సందడి చేస్తుంటారు. వివిధ సినిమా ఫంక్షన్ల లో కనిపిస్తూ ఉంటారు. ఆటోగ్రాఫ్ లు ఇస్తూ అదరగొడుతుంటారు. చుట్టూ మళ్ళీ మార్బలంతో హల్ చల్ సృష్టిస్తుంటారు.ఒకప్పుడు ఇటువంటి బంగారాజులు ఒకరి ఇద్దరు మాత్రమే ఉండేవారు. ఇటీవల కాలంలో వీరి సంఖ్య పెరిగిపోయింది. ఓ నివేదిక ప్రకారం హైదరాబాదులో దాదాపు 50 మందికి పైగా ఇటువంటి గోల్డ్ మ్యాన్ లు ఉన్నారు. వీరంతా ఆ స్థాయిలో బంగారం ఎలా సంపాదించారు?. వీరికి ఆ బంగారం ఎక్కడి నుంచి వచ్చింది అనే విషయాల మీద ఆ మధ్య పోలీసులు ఫోకస్ పెట్టడంతో.. వీరి బాగోతం బయటపడింది. తాజాగా తెలంగాణ పోలీసులు అత్తాపూర్ ప్రాంతానికి చెందిన సూర్య కుమార్ అలియాస్ సూర్య భాయ్ ని అరెస్ట్ చేశారు.సూర్య ఒంటిమీద బంగారం ధరించి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచేవాడు. ఇతడికి సోషల్ మీడియాలో లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇతడు ధరించిన బంగారం నిజమని చాలామంది అప్రోచ్ అయ్యారు. అందులో ఒకడిని సూర్య నిండా ముంచాడు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని హిమాయత్ నగర్ కు చెందిన ఒక కేఫ్ నిర్వాహకుడికి ఏకంగా 32. 30 లక్షలకు ముంచాడు. ఎంతసేపటికి బంగారం ఇవ్వకపోవడంతో ఆ వ్యక్తి సూర్యను నిలదీశాడు. దీంతో మూడు ఐఫోన్లు ఇచ్చాడు. 20 లక్షలకు చెక్కులు ఇచ్చాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు మళ్లీ ఆ కేఫ్ నిర్వాహకుడు కొంతమందితో కలిసి సూర్య ఇంటికి వెళ్లారు. అక్కడ గొడవ చేయడంతో.. సూర్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. సూర్యను పోలీసులు విచారించగా అతని అసలు రంగు బయటపడింది.సూర్య ధరించేది నిజమైన బంగారం కాదు. అది పూర్తిగా వన్ గ్రామ్ గోల్డ్. హైదరాబాద్ నగరంలో ఉన్న బంగారు బాబులు మొత్తం ధరించేది వన్ గ్రామ్ గోల్డ్ మాత్రమే. హైదరాబాదు నగరంలో నిజమైన గోల్డ్ ధరించే వారు కేవలం ఇద్దరు మాత్రమేనని తెలుస్తోంది వారు కూడా పాత బస్తీలో ఉంటారని పోలీసులు చెబుతున్నారు. మిగతా వారంతా ఇలా రోల్డ్ గోల్డ్ ధరించి.. జనాలను మోసం చేస్తున్నారని.. సోషల్ మీడియాలో హైప్ కోసం ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు అంటున్నారు. ఇటువంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# ఇరాన్ సుప్రీమ్ లీడర్ అంత్యక్రియలు.. భారత్ నుంచి హాజరయ్యేది వీళ్లేనా..?



అమెరికా , ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూలై 5 వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు ఈ అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. భారత్ తరఫున కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరిటా బీహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ హాజరుకానున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇరాన్ వర్గాలు పేర్కొనగా దీనిపై ఇంతవరకు భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన తొలి రోజే 86 ఏళ్ల అలీ ఖమేనీ సహా 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతిచెందారు. ఖమేనీ కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతిచెందగా.. కుమారుడు మొజ్తాబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. జూలై 9న ఖమేనీ స్వస్థలం మషాద్‌లో ఆయనను ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రెండు కోట్లకు మంది వరకు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించారు.

# 3 ఏళ్ల బాలికపై హత్యాచారం.. వృద్ధుడికి మరణ శిక్ష

మూడేళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడ్డ 65 ఏళ్ల వృద్ధుడికి పుణెలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ కేసు అత్యంత అరుదైనదని అడిషనల్ జడ్జి ఎస్ఆర్ సాలంఖే అభిప్రాయపడ్డారు. అత్యంత పాశవిక చర్యకు పాల్పడ్డ నిందితుడు భిమ్‌రావ్ కాంబ్లేకు మరణ శిక్ష విధించక తప్పదని అన్నారు. గతంలోనూ పలు నేరాలు చేసిన చరిత్ర భిమ్‌రావ్‌ది అని పేర్కొన్నారు.ఈ కేసులో కోర్టు భీమ్‌రావ్‌ను జూన్ 25న దోషిగా తేల్చింది. తాజాగా శిక్ష ఖరారు చేసింది. మే 1న జిల్లాలోని భోర్ తెహసిల్‌లోని నస్రాపూర్ గ్రామంలో నిందితుడు దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారికి మాయమాటలు చెప్పి పసువుల షెడ్డులోకి తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. చిన్నారి మృతదేహాన్ని షెడ్డులో గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన అనంతరం పోలీసులు నిందితుడిని అదుపులో తీసుకున్నారు. గతంలోనూ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.



# రజనీకాంత్ చుట్టూ.. ఐటీ ఉచ్చు...



హైదరాబాద్, జూన్ 29 (న్యూస్ పల్స్) ఆయన సాంప్రదాయని.. శుద్ధ పూసని టైపు. పైగా తనంత నిజాయితీ కలిగిన జర్నలిస్టు లేడని చెప్పుకుంటాడు. ఇంటర్వ్యూలు చేస్తాడు. అందులో లేకి ప్రశ్నలు అడుగుతాడు. అంతేకాదు, గతంలో ప్రైమ్ టైం లో వార్తలు చదివేవాడు. ఆ తర్వాత అతగాడి వ్యవహారం తెలిసి మేనేజ్మెంట్ కొద్ది రోజులు పక్కన పెట్టింది. కేవలం ఇంటర్వ్యూలకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేసింది. దీంతో అప్పటినుంచి అతడు కేవలం ఇంటర్వ్యూలు మాత్రమే చేస్తాడు. పైగా ప్రశ్నిస్తే శత్రువు అవుతాయేమో.. అయినా పర్వాలేదు ప్రశ్నిస్తూనే ఉంటా అంటూ గొప్ప గొప్ప పతిత్తు కబుర్లు చెబుతుంటాడు.ఇప్పుడు ఈ సుప్రసిద్ధ జర్నలిస్టు కు ఐటీ నోటీసులు వచ్చాయి. ఏకంగా వందల కోట్ల వెనకేసుకున్నాడట. ఒక్కొక్క ఇంటర్వ్యూకు 15 నుంచి 20 లక్షల వరకు వసూలు చేస్తున్నారట. పైగా ఈ విషయం మేనేజ్మెంట్ కి తెలిసి అంతర్గత విచారణ కూడా మొదలుపెట్టిందట. ఇటీవల ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో అతడేకంగా 11 కోట్లు పెట్టి అత్యంత విలాసవంతమైన ప్లాట్ కొనుగోలు చేశాడు. అక్కడితో ఆగిపోలేదు మోకీలా ప్రాంతంలో ఎనిమిది కోట్లతో విల్లా కొనుగోలు చేశాడు. మియాపూర్ ప్రాంతంలో త్రిబుల్ బెడ్ రూమ్ ప్లాట్ కొనుకున్నాడు. ఇటీవల ఢిల్లీలో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లి రావడానికి ఏకంగా స్పెషల్ ఫ్లైట్ బుక్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన ఆధారాలు ఐటి శాఖకు తెలియడంతో అతడికి నోటీసులు జారీ అయ్యాయి.ఇక్కడితోనే ఆ జర్నలిస్ట్ సంపాదన వ్యవహారం ఆగిపోలేదు. బెంగళూరులో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో భారీగా పెట్టుబడులు పెట్టాడు. ఇటీవల ఆ కంపెనీ మీద ఐటి అధికారులు దాడులు చేశాడు. అమరావతిలో అతడు కొనుగోలు చేసిన భూముల ధరలు భారీగా పెరిగిపోయాయి. కృష్ణయ్యపాలెంలో 18 ఎకరాల భూమి కొనుగోలు చేస్తే.. ఇటీవల సిఆర్డిఏ నుంచి తనకు ప్లాట్ రావాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయాలు తెలియడంతో ఇన్కమ్ టాక్స్ అధికారులు అందరికీ నోటీసులు ఇచ్చారు. అంత కాదు హైదరాబాద్ రోడ్ నెంబర్ 36 లో నడుస్తున్న ఓ పబ్ లో ఇతడికి వాటా ఉంది. విశాఖపట్నంలో కూడా ఒక పబ్ ఉంది. గతంలో ఓ ప్రభుత్వం ఈయనకు భారీగా డబ్బు ఇచ్చింది. ఆ డబ్బులు మొత్తం క్యాష్ రూపంలో తీసుకున్నాడు. హైదరాబాద్ నగరంలో ఉన్న అన్ని డిజిటల్ ప్లాట్ ఫామ్ లు ఒక పార్టీకి అనుకూలంగా వనిచేసే విధంగా ఒప్పందం కుదిరించాడు. అయితే ఆ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో.. ఆ డిజిటల్ ప్లాట్ఫామ్ నిర్వాహకులు ఇతడిని ప్రశ్నించారు.. తాను ఇప్పుడు ఆ డబ్బులు ఇప్పించలేనంటూ చేతులు కూడా ఎత్తేశాడు.తెలంగాణ రాష్ట్రంలో కొంతమంది రాజకీయ నాయకులను ఇటీవల ఇంటర్వ్యూలకు పిలిపించాడు ఇతడు. వారి దగ్గర నుంచి భారీగానే లక్షల్లో వసూలు చేశాడు. అయితే మార్కెటింగ్ సిబ్బంది క్షేత్రస్థాయి వరిశీలనలో ఈ విషయం తెలియడంతో మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్లారు.. అంతేకాదు తన బినామీతో వసూలు చేసిన మొత్తం కూడా మేనేజ్మెంట్ కు తెలియడంతో.. మేనేజ్మెంట్ ఇతడి మీద విచారణ మొదలుపెట్టింది. అటు ఏపీలో.. ఇటు తెలంగాణలో అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోవడంతో.. ఈ సుద్దపూస జర్నలిస్ట్ పరిస్థితి సంకట స్థితిలో పడింది. చూడాలి మరి ఈసారి పోస్ట్ ఉంటుందా.. ఊడుతుందా..

# సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ లో కర్ణాటక ఓటర్లు


**సెడం నియోజకవర్గం నుంచి ॥ వేల మంది కొడంగల్ లో ఓటర్లుగా ఉన్నారు**

**కొడంగల్ లో 22 వేల డూప్లికేట్ ఓట్లు ఉంటే, ॥ వేలు కర్ణాటక ఓటర్లు ఉన్నారు.**

**సరిగ్గా అంతే మార్జిన్ తో ఆయన గెలిచారు. అంటే సీఎంకు ఈసీ ఫేవర్ చేసిందా?**

**వన్ నేషన్, వన్ ఎలక్షన్, వన్ ఓటు అనే విధానం ఉండాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై మాకు చాలా అనుమానాలున్నాయి. సాధారణంగా ఎస్ఐఆర్ కు రిఫరెన్స్ ను ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి తీసుకోవాలి. కానీ 2025 జనవరి నుంచి వీళ్లు ఎస్ఐఆర్ కు రిఫరెన్స్ పాయింట్ తీసుకుంటున్నారు. ఏటా నిర్వహించే ఎస్ఎస్ఆర్ రిఫరెన్స్ పాయింట్ అయిన జనవరి 1 వ తేదీనే తీసుకోవాలి. కానీ అలా కాకుండా గతేడాది జనవరి 1 తేదీని ఎస్ఐఆర్ కు రిఫరెన్స్ పాయింట్ చేశారు. ఐతే మా భోదన్ లో పరిస్థితి ఎలా ఉందని తెలుసుకుంటే అక్కడ 7 వేలకు పైగా ఓట్లను తీసేశారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.వాళ్లు షిఫ్ట్ అయ్యారా, చనిపోయారా? డూప్లికేషన్ ఓట్ల అనేది ఈసీ చెప్పటం లేదు. జనవరి 1, 2025 నుంచి ఇప్పటి వరకు ఏడాదిన్నరలో ఒక్క భోదన్ నియోజకవర్గంలో 7 వేల ఓట్లు డిలీట్ అయ్యాయి. ఈ 7 వేల ఓట్లకు సంబంధించి స్పష్టమైన క్లారిటీ ఇవ్వాలని మేము ఈసీ ని కోరుతున్నాం. సినిమా యాక్టర్ ప్రకాష్ రాజ్ కి మూడు రాష్ట్రాల్లో ఓటు ఉందని చెబుతున్నారు. ఆ ఓట్లను తొలగించేందుకు ఏడు ఏళ్లు పడితే భోదన్ లో మాత్రం ఏడాదిన్నరలో 7 వేల ఓట్లు తొలగించారు. ఒక నియోజకవర్గంలో 2 శాతం కన్నా ఎక్కువ ఓట్లను తొలగించాల్సి వస్తే తొలిగించే ప్రతి ఓటరుకు మూడుసార్లు నోటీసులు ఇవ్వాలని ఈసీ నిబంధన ఉంది. కానీ ఆ విధంగా ఎవరికీ నోటీసు ఇవ్వలేదు. ఇస్తే ఈసీ దీని గురించి స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. మా భోదన్ లో 7 వేల ఓట్లు తొలగించటంతో మేము మిగతా నియోజకవర్గాల్లో అలాగే జరిగిందా అన్న అనుమానంతో కొడంగల్ లో చెక్ చేశాం. అక్కడ కేవలం 808 ఓట్లు మాత్రమే డిలీట్ చేశారు. భోదన్ లో ఏడు వేలు ఎలా? కొడంగల్ లో 8 వందలు మాత్రమే ఎలా? కొడంగల్ లో దాదాపు 22, 433 డూప్లికేట్ ఓట్లు కూడా ఉన్నాయి. అందులో దాదాపు వెయ్యి వరకు మేము ప్రింట్ తీశాం. 2018 లో కొడంగల్ ఉన్న ఓట్ల సంఖ్యతో పోల్చుకుంటే 2023 నాటికి దాదాపు 30 వేల ఓట్లు పెరిగాయి. పైగా కొడంగల్ కు పక్కనే ఉన్న కర్ణాటకలోని సెడం అనే నియోజకవర్గం నుంచి 11 వేల మంది ఓటర్లు కొడంగల్ లో ఉన్నారు. సెడంలోనూ కొడంగల్ లోనూ 11 వేల మంది ఓటర్లు ఎలా ఉంటారని ప్రశ్నించారు.కొడంగల్ లో ఉన్న డూప్లికేషన్, అదే విధంగా సెడం కు సంబంధించిన 11 వేల ఓట్లు కలిపితే 33 వేల ఓట్లు అవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో దాదాపు 33 వేల ఓట్ల మెజార్టీతోనే గెలిచారు. అంటే డూప్లికేట్, అక్రమంగా రిజిస్టర్ చేసుకున్న ఓట్లతో గెలుపు, ఓటమిలను నిర్ణయించబడుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఎన్నికల సంఘం ముఖ్యమంత్రికి ఏమైనా ఫేవర్ చేసిందా అనే అనుమానం వస్తోంది.

# జైపుర్‌లో విషాదం.. గోడ కూలడంతో ముగ్గురు కార్మికుల మృతి

రాజస్థాన్ జైపుర్‌లోని చందవాజీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఓ భవనం గోడ అకస్మాత్తుగా కూలిపోవడంతో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. కాగా.. కూలీలతో సహా 12 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



బేస్మెంట్‌లో ఎన్‌టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో గోడ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు శిథిలాల్లో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు అధికారులు. శిథిలాల్లో చిక్కుకున్న మరి కొందరు కార్మికుల కోసం రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక జిల్లా కలెక్టర్ సందేశ్ నాయక్ సహా ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

# ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ రేపు బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారత మిలిటరీకి కొత్త టాప్ ఆఫీసర్లు రానున్నారు. భారత ఆర్మీ చీఫ్‌గా మంగళవారం లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక బుధవారం భారత వైమానిక దళ వైస్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు. భారతీయ రక్షణ వ్యవస్థలో ఇటీవలే కొత్తగా ఇద్దరు ఉన్నత పదవులను అలంకరించిన విషయం తెలిసిందే. చీఫ్ ఆఫ డిఫెన్స్ స్టాఫ్‌గా జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, నేవీ చీఫ్‌గా అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్.. బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.ప్రస్తుతం ఆర్మీ వైస్ చీఫ్‌గా ఉన్న జనరల్ సేథ్.. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకుంటారు. ధీరజ్ సేథ్.. ఆర్మర్డ్ కాప్స్ చెందిన వ్యక్తి. ఆయన 1986లో ఆర్మీలో కమిషన్ అయ్యారు. మూడు దశాబ్దాల తర్వాత ఆర్మర్డ్ కాప్స్‌కు చెందిన ఆఫీసర్ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. 1997లో చివరిసారి ఆర్మర్డ్ కాప్స్‌కు చెందిన జనరల్ రాయో చౌదరీ ఆర్మీ చీఫ్‌గా చేశారు. లెఫ్టినెంట్ జనరల్ సేథ్‌కు ఆపరేషనల్, స్ట్రాటజిక్, క్యాపబులిటీ డెవలప్మెంట్, ఇన్‌స్టిట్యూషనల్ డొమెయిన్స్‌లో విస్తృతమైన అనుభవం ఉన్నది.జూలై ఒకటో తేదీన ఐఏఎఫ్ వైస్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం ఐఏఎఫ్ చీఫ్‌గా ఉన్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో సమానంగా ఉన్న సీనియన్ అధికారి ఆయన. అయితే ఈ ఏడాది అక్టోబర్‌లో ఆయన పదవీకాలం పూర్తి కానున్నది. ప్రస్తుతం చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా దీక్షిత్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సీడీఎస్ నేతృత్వంలో త్రివిధ దళాలకు చెందిన సీఐఎస్సీ పనిచేస్తుంది. ఆయన ఫైటర్ పైలట్ కూడా. బెంగుళూరులోని ఫ్లయిట్ టెస్ట్ స్క్వాడ్రన్‌లో కమాండింగ్ ఆఫీసర్‌గా చేశారు.ఆర్మీ చీఫ్‌గా సేథ్ రావడంతో.. వైస్ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ ఆ బాధ్యతలను స్వీకరిస్తారు.



# రాష్ట్రంలో అరు నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికలు.. సిద్ధంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు ఎంకే స్టాలిన్ పిలుపు..!

తమిళనాడు లో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నై లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు.ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు.



ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు.అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని అన్నారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు.ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచారంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.

# పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**జులై 10న చేనేత సంఘ ఎన్నికలు**

భూదాన్ పోచంపల్లి, జూన్ 29 : పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి ఎండీ.యూసఫ్ అలీ సోమవారం విడుదల చేశారు.నామినేషన్ల స్వీకరణ : జూలై 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకునామినేషన్ల పరిశీలన: జూలై 5నామినేషన్ల ఉప సంహరణ, అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల కేటాయింపు : జులై 6పోలింగ్, కౌంటింగ్ : జూలై 10. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకుఅనంతరం ఎన్నికల కౌంటింగ్ జరుగునని ఎన్నికల అధికారి తెలిపారు. సంఘంలో 9 మంది డైరెక్టర్లను రహస్య ఓటింగ్ పద్ధతిలో సభ్యులు ఎన్నుకుంటారని, ఇందులో ఇద్దరు మహిళా డైరెక్టర్లు, ఏడుగురిని జనరల్ కేటగిరీలో ఎన్నుకుంటారని ఆయన తెలిపారు.



# సినిమా

## వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం

### ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు

### నటుడు రామ్ చరణ్




సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు.ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.



## బాలకృష్ణ- కొరటాల కాంబో

### 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం




బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ప్రేక్షకుల దృక్కోణం మారింది

### అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా: సాయిదుర్గా తేజ్

సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.



## కలెక్షన్లలో మా ఇంటి బంగారం దూకుడు

### పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత సమంత నుంచి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ విజయపథంలో కొనసాగుతోంది. మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ, వీకెండ్‌లో మరింత జోరు చూపించి భారీ కలెక్షన్లను నమోదు చేసింది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలకు కనిపించే స్థాయిలో 'మా ఇంటి బంగారం'కు ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం, శనివారం, ఆదివారం రోజుల్లో మరింత మెరుగైన వసూళ్లను రాబట్టింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే మా ఇంటి బంగారం సినిమా ఇండియా వైడ్ నెట్ కలెక్షన్లలో రూ.23.10 కోట్ల మార్కును దాటేసింది. ఈ మూడు రోజుల్లో సినిమా సాధించిన మొత్తం ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ.26.69 కోట్లకు చేరాయి.సమంతకు ఉన్న క్రేజ్ కారణంగా ఈ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లోభారీ స్పందన లభించింది. కేవలం తెలుగు వెర్షన్ నుంచే మూడో రోజు రూ.9.50 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం.కుటుంబ ప్రేక్షకులు, మహిళలు, యువత ఈ చిత్రానికి పెద్ద ఎత్తున థియేటర్లకు రావడంతో అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయి.ముఖ్యంగా మౌత్ టాక్ సినిమాకు అతిపెద్ద బలంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకోవడం, కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా ప్రశంసించడం వల్ల వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు భారీ ఓపెనింగ్స్ సాధించడం అరుదుగా కనిపిస్తుంది. అయితే 'మా ఇంటి బంగారం' ఆ రికార్డులను తిరగరాస్తూ, సమంత స్టార్‌డమ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచింది. సినిమాలో సమంత నటన, ఎమోషనల్ సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చాలా కాలం తర్వాత ఆమె పూర్తి స్థాయి ప్రధాన పాత్రలో కనిపించడంతో అభిమానులు కూడా థియేటర్లకు భారీగా తరలివస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో కుటుంబ భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మిళితం చేశారు. ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం, సహజమైన పాత్రల రూపకల్పన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి.గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు తమ పాత్రల్లో మెప్పించగా, సమంతతో వారి సన్నివేశాలు సినిమాకు మరింత బలం చేకూర్చాయి. వీకెండ్‌లో అనేక

## అనిల్ రావిపూడి మూవీలో ఛాన్స్ అంటూ ప్రకటనలు

### అవన్నీ ఫేక్..నమ్మొద్దంటూ ప్రకటన విడుదల

ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలోక్రేజ్ ఉన్న దర్శకుల్లో అనిల్ రావిపూడి ఒకరు. ఆయన మూవీలో నటించేందుకు ఎంతో మంది ఆసక్తి చూపుతారు. దీన్నే అదనుగా తీసుకుని కొంతమంది సరికొత్త మోసానికి తెరలేపారు. ఈ విషయం కాస్తా చిత్ర నిర్మాణ సంస్థ దృష్టికి వెళ్లడంతో అవన్నీ ఫేక్ అంటూ ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్నది. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలు. ఇటీవల పూజా కార్యక్రమాలతో ఈ మూవీ మొదలైంది. అంతేకాదు, 'రాయల సీమ నేపథ్యం' అంటూ ప్రచారాన్ని కూడా అనిల్ రావిపూడి వినూత్నంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ఇందులో నటించే అవకాశం ఇప్పిస్తామంటూ కొంతమంది సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టారు. దీంతో అవన్నీ ఫేక్ అంటూ నిర్మాణ సంస్థ ÷న్ స్క్రీన్స్ తెలిపింది. మా సినిమా పేరుతో ఒక నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ కాస్టింగ్ కాల్‌కు, మా చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదు. దయచేసి అలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. మా సినిమా తరఫున కాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పత్రాలు లేదా డబ్బు ఇవ్వవద్దని విజ్ఞప్తి. మా చిత్రానికి సంబంధించిన ఏవైనా అధికారిక కాస్టింగ్ ప్రకటనలు ఉంటే, అవి కేవలం మా అధికారిక, ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాల ద్వారానే ప్రకటిస్తాం. జాగ్రత్తగా ఉండండి.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844